సాక్షి అనంతపురం

శుక్రవారం । 21 । ఫిబ్రవరి । 2025



టన్ను చీనీ రూ.22,250

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.22,250, కనిష్టంగా రూ.4 వేలు, సరాసరిన రూ.12 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.9

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.9, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.8 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
37.8°/ 17.6°

జిల్లాలో గురువారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. చలి తగ్గుతుండగా.. ఎండలు క్రమంగా పెరుగుతున్నాయి. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఒత్తిడికి గురి కావొద్దు.. పరీక్షలు బాగా రాయండి

- విద్యార్థులకు 'ఆల్ ద బెస్ట్' చెప్పిన కలెక్టర్



అనంతపురం ఎడ్యుకేషన్: ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు బాగా రాయాలని విద్యార్థులకు కలెక్టర్ వినోద్ కుమార్ సూచించారు. పరీక్షలకు సన్నద్ధమవుతున్న వారికి ఆయన ఆల్ ద బెస్ట్ చెప్పారు. త్వరలో టెన్త్, ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు వీడియో ద్వారా సందేశం ఇచ్చారు. 'ఎలాంటి టెన్షన్ లేకుండా పరీక్ష హాలులోకి వెళ్లండి. ప్రశ్నపత్రాన్ని బాగా చదవండి. ప్రశ్నలు ఎన్ని వస్తాయో...ఎన్ని రావో చూసుకోండి. ముందుగా వచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయండి. అన్ని ప్రశ్నలకూ సమాధానాలు రాసే ప్రయత్నం చేయండి. వాటర్ బాటిల్ వెంట తీసుకెళ్లండి. అద్భుతమైన కలలు కనండి. నో స్ట్రెస్...గివ్ యువర్ బెస్ట్...ఆల్ ద బెస్ట్ ఫర్ యువర్ ఎగ్జామ్...మీ కలెక్టర్' అంటూ పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



కళ్యాణదుర్గం సబ్‌జైలులో గదులను పరిశీలిస్తున్న జడ్జి శివప్రసాద్ యాదవ్

గార్లదిన్నె: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి శివప్రసాద్ యాదవ్ సూచించారు. గురువారం మండల పరిధిలోని కేకే తండా గ్రామంలో న్యాయ సేవా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిక్కుతోచని స్థితిలో ఉన్న నిర్భాగ్యులకు వన్ స్టాప్ సెంటర్ ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో 7 రోజులు ఉచితంగా ఆశ్రయం కల్పిస్తారన్నారు. అలాగే వారి సమస్య పరిష్కరించుకునే మార్గాలు, ఉచిత న్యాయ సహాయం కూడా పొందవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాలు, లింగ నిర్ధారణ నేరమన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ దామోదరమ్మ, ఎంఈఓ చంద్ర నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలు తనిఖీ

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం పట్టణంలోని సబ్ జైలును గురువారం న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి శివప్రసాద్ యాదవ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. బాల నేరస్తులు ఉన్నారా అని ఆరా తీశారు. అనంతరం వంట గది, స్టోర్ రూమ్, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో లాయర్ దాదా ఖలందర్, చలపతి, జైల్ సూపరింటెండెంట్ ధనుంజయ నాయుడు, పారా లీగల్ వలంటీర్ అనిత, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.


అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

గార్లదిన్నె: మండల పరిధిలోని ముకుందాపురం గ్రామానికి చెందిన ఓ రైతు అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు.. ముకుందాపురం గ్రామానికి చెందిన రైతు సదాశివారెడ్డి (65) తన 15 ఎకరాల భూమిని ఇతరులకు రిజిస్ట్రేషన్ ఆయకం పెట్టాడు. దాదాపు రూ.20 లక్షల అప్పులు చేశాడు. ఈ క్రమంలో అప్పులు ఎలా తీర్చాలని ఇంట్లో రోజూ మదన పడుతుండేవాడు. ఈ నెల 14వ తేదీన పెనకచెర్ల గ్రామ సమీపంలో పురుగు మందు తాగాడు. గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా... చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా పేర్కొన్నారు.

కరువు మండలాల్లో ఉపాధి పనిదినాల పెంపు

అనంతపురం టౌన్: కరువు మండలాల్లో ఉపాధి పనిదినాలను పెంచుతూ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సలీంబాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇటీవలే కేంద్ర కరువు బృందాలు పర్యటించి 7 మండలాలను(అనంతపురం రూరల్, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, నార్పల, రాప్తాడు, విడపనకల్లు, యాడికి) కరువు ప్రాంతాలుగా ప్రకటించాయన్నారు. ఆయా మండలాల్లో ఉపాధి పని దినాలను 100 నుంచి 150 రోజులకు పెంచినట్లు తెలిపారు. 100 రోజుల పనులు పూర్తి చేసుకున్న కుటుంబాలు సైతం అదనంగా మరో 50 రోజులు హాజరు కావొచ్చన్నారు.

సర్వే..శఠగోపం!



- ఉమ్మడి జిల్లాలో ఇంటింటి సర్వేకి చంద్రబాబు సర్కారు శ్రీకారం
- ఫ్రిజ్‌లు, ఏసీలు ఉంటే పక్కాగా నమోదు చేయాలని ఆదేశాలు
- కరెంటు బిల్లులు, సొంతిళ్లు, కారు వివరాలు కూడా సేకరణ
- ఈ సారి రేషన్‌కార్డులు, పెన్షన్లలో భారీగా కోత!
- ఇప్పటికే వైకల్య సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పేరుతో పింఛన్ల కట్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఎన్నికల వేళ ఎన్నో హామీలిచ్చి గద్దెనెక్కిన చంద్రబాబు ఇప్పుడు తన నిజ స్వరూపాన్ని బయటపెడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 'సంపద సృష్టిస్తా.. ఆ సంపదను పేదలకు పంచుతా.. రైతులు పొలంలోనే కరెంటు ఉత్పత్తి చేసి, ఆ తర్వాత వాడుకోగా మిగిలింది గవర్నమెంటుకు సప్లై చేసే విధంగా చేస్తా' అంటూ అప్పట్లో లేనిపోని గొప్పలు చెప్పిన బాబు.. ఇప్పుడు పెన్షన్లు, రేషన్ తదితర ప్రభుత్వ పథకాలకు కోత వేసేలా పావులు కదుపుతుండటంపై అన్ని వర్గాలు పెదవి విరుస్తున్నాయి.

భారీగా ఆంక్షలు..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులతో ప్రతి ఇంటినీ జల్లెడ పట్టేలా చంద్రబాబు ప్రభుత్వం సర్వేకు శ్రీకారం చుట్టింది. ఇంటింటి సర్వేలో ప్రభుత్వ పథకాల అర్హతకు భారీగానే ఆంక్షలు విధించనున్నారు. కరెంటు బిల్లు ఎక్కువ వచ్చిందంటే వెంటనే ఆ ఇంట్లో వారికి వచ్చే పెన్షన్, రేషన్ కట్‌చేసేలా సర్వే నిర్వహిస్తారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఇంటికీ రిఫ్రిజిరేటర్ (ఫ్రిజ్) ఉంది. ఇప్పుడు ఇది కూడా ఆంక్షల జాబితాలోకి వచ్చింది. కరెంటు బిల్లు ఎక్కువగా వచ్చి, ఫ్రిజ్ ఉందంటే కఠిన నిర్ణయాలు తీసుకోనున్నారు. ఇక కారు, సొంతిళ్లు, భూములు, స్థలాలు కూడా ఆంక్షల జాబితాలో చేరుతున్నాయి. పైన నిర్ణయించిన వాటిలో ఏవైనా ప్రభుత్వ పథకానికి అడ్డంకిగా మారే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

ఏవి ఉన్నా హోల్డ్..!

గ్రామ/వార్డు సచివాలయ కార్యదర్శులతో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించి ముందుగా అర్బన్ ఏరియాల్లో కార్యదర్శులకు ఈనెల 19న శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటికే ఇళ్లన్నీ జియోట్యాగింగ్‌లో ఉన్నాయి. ఆయా ఇళ్లకు వెళ్లి గత నెల వచ్చిన కరెంటు బిల్లుతో పాటు ఫ్రిజ్ ఉందా, ఏసీ ఉందా వంటివన్నీ పరిశీలించి నమోదు చేస్తారు. ముందుగా మున్సిపాలిటీల పరిధిలో పూర్తయ్యాక, తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో సర్వే నిర్వహిస్తారని, ఆయా వస్తువుల్లో ఏవి ఉన్నాయని తేలినా పథకాలు హోల్డ్‌లో పెడతారని చెబుతున్నారు.

వైకల్య బాధితులనూ వదల్లేదు..

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా వైకల్య బాధితులను కూటమి సర్కారు ముప్పు తిప్పలు పెడుతోంది. ఇప్పటికే జిల్లాలో వేలాది పెన్షన్లకు కత్తెర వేసిన విషయం తెలిసిందే. గడిచిన పదేళ్లుగా వైకల్య పెన్షన్ తీసుకుంటున్న వారికి మళ్లీ ఇప్పుడు కొత్తగా పరీక్షలు చేస్తామని చెప్పింది. దీంతో శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాలో ఉన్న 36 వేల మంది లబ్ధిదారులు అనంతపురం రావాల్సి వస్తోంది. డాక్టర్లు ఇక్కడే ఉండటంతో 130 కిలోమీటర్ల నుంచి కూడా అవస్థలు పడుతూ వస్తున్నారు. తాజాగా సదరం వెరిఫికేషన్‌లో సుమారు 30 శాతం పింఛన్లకు కోత వేసే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

జిల్లాలో పింఛన్ల వివరాలు..

వృద్ధాప్య పింఛన్లు	1,39,372
వితంతు	66,534
చేనేతల పింఛన్లు	6,588
కల్లుగీత	351
ఒంటరి మహిళ	6,687
వీల్‌చైర్‌కే పరిమితం	1,425
కండరాల క్షీణత	1,074
డయాలసిస్	383
చర్మకారులు	3,464
హెచ్ఐవీ	2,432
తలసేమియా	128

సకాలంలో మోడల్ సర్వే

అనంతపురం అర్బన్: పీ4 మోడల్ సర్వే సకాలంలో చేపడతామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు కలెక్టర్ వి.వినోద్ కుమార్ చెప్పారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి పీ4 మోడల్ సర్వేపై కలెక్టర్లతో సీఎస్ సమీక్షించి దిశానిర్దేశం చేశారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు జేసీ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్ఓ ఎ.మలోల, ఇతర అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చామన్నారు. సర్వే మొదటి దశ గురువారం జిల్లాలో ప్రారంభమైందని, మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులను భాగస్వాముల్ని చేశామని చెప్పారు.

'పీఎంఏవై' ఇళ్లకు దరఖాస్తుల స్వీకరణ

అనంతపురం టౌన్: ప్రధాన మంత్రి అవాస్ యోజన (పీఎంఏవై) కింద ఇళ్ల నిర్మాణాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శైలజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సొంత స్థలం ఉండి పొజిషన్ సర్టిఫికట్ లేదా ఇంటి డీ పట్టా ఉన్న వారు మార్చి 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం వాటా రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ. లక్షతోపాటు ఎస్సీలకు, బీసీలకు, పీవీటీజీలకు అదనంగా రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అందజేయనున్నట్లు తెలిపారు.

చిత్తడి నేలలను పరిరక్షించాలి

అనంతపురం అర్బన్: జిల్లాలో చిత్తడి నేలల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మార్చి 10లోగా జిల్లాలో గుర్తించదగిన 15 చిత్తడి నేలల ప్రాంతాల కోసం నోటిఫికేషన్ ప్రతిపాదనలను సమర్పించాలని చెప్పారు. రెండో దశలో జూన్ 10వ తేదీ నాటికి మరో 100 నోటిఫికేషన్ ప్రతిపాదనలు, మూడో దశలో జూలై 10 నాటికి మిగిలిన వాటికి నోటిఫికేషన్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. డీఎఫ్ఓ మాట్లాడుతూ చిత్తడి నేలల ప్రాముఖ్యతను వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవల్లో జిల్లా వెనుకబడింది..

'ప్రజలకు సేవలందించడంలో జిల్లా వెనుకబడి ఉంది. ప్రభుత్వ ప్రాధాన్యత అంశాల అమలులో రాష్ట్రంలోనే జిల్లా ఆరో స్థానంలోపే ఉండేలా పనిచేయాలి' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్ఓ, డీఎంహెచ్ఓ, ఆర్టీసీ, రెవెన్యూ, మునిసిపల్ శాఖ అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి జిల్లా ఆరో స్థానంలోపే ఉండేలా చూడాలన్నారు. ఎక్సైజ్, అన్నా క్యాంటీన్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నిరుపయోగంగా ఉన్న సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు.

23న గ్రూప్-2 మెయిన్స్

- 14 కేంద్రాల వద్ద ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి
- కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో జేసీ శివ్ నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: ''ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఈనెల 23న గ్రూప్-2 మెయిన్స్ రాత పరీక్షలు జరగనున్నాయి. 14 కేంద్రాల్లో నిర్వహించనున్న పరీక్షలకు 7,293 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. కేంద్రాల వద్ద ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి. కనీస సౌకర్యాలు అందుబాటులో ఉంచాలి'' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జేసీ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్ఓ ఎ.మలోలతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీపీఎస్సీ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. పరీక్షల నిర్వహణకు కోఆర్డినేటింగ్ అధికారిగా జేసీ ఉంటారన్నారు. ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ, సెక్షన్ ఆఫీసర్లు పర్యవేక్షిస్తారన్నారు. పేపర్-1 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, పేపర్-2 మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతుందన్నారు. 14 పరీక్ష కేంద్రాలకు 14 మంది జిల్లాస్థాయి సీనియర్ అధికారులను లైజన్ అధికారులుగా నియమించామన్నారు. అభ్యర్థుల సౌలభ్యం కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు చేయండి

జిల్లాలో మార్చి 1 నుంచి 20 వరకు జరగనున్న ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు డీఆర్ఓ కో-ఆర్డినేటింగ్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. పరీక్షల ప్రశ్నపత్రాలు కేంద్రాలకు తరలించే సమయంలో పోలీసు బందోబస్తు తప్పనిసరి అన్నారు. కేంద్రాల వద్ద వైద్య సిబ్బంది ఉండాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అంబులెన్స్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సమావేశంలో ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ ఎస్ఎన్ షరీఫ్, సెక్షన్ ఆఫీసర్లు శంకర్రావు, ఆరోగ్యవాణి, నాగభవాని, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, డీఈఓ ప్రసాద్‌బాబు, డీవీఈఓ వెంకటరమణనాయక్, పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్, డీపీఓ నాగరాజునాయుడు, సీపీఓ అశోక్ కుమార్, జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, ఎస్ఐసీ డైరెక్టర్ రవిశంకర్, ఉపాధి కల్పనాధికారి కల్యాణి, ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ ఏడీ రజిత, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

- బుక్కరాయసముద్రం మండల పరిధి రోటరీపురంలో ఉన్న గ్రూప్-2 పరీక్ష కేంద్రం ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలను గురువారం సాయంత్రం కలెక్టర్ సందర్శించారు. అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఈనెల 23న జరగనున్న గ్రూప్-2 పరీక్షలకు హాజరుకానున్న అభ్యర్థుల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం నుంచి 23వ తేదీ వరకు కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉంటుందన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఏదేని సమాచారం లేదా ఫిర్యాదు కోసం కంట్రోల్ రూమ్ నంబర్లు 18004258804, 08554-231722కు కాల్ చేసి తెలియజేయవచ్చని కలెక్టర్ సూచించారు.

ట్రాక్టర్‌తో ఢీకొట్టి.. కాలువలో పడేశారు

- యూట్యూబ్ చానల్ నిర్వాహకుడి హత్య కేసులో ముగ్గురి అరెస్ట్



నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసులు

గుంతకల్లు: యూట్యూబ్ చానల్ నిర్వాహకుడు భోగాల తిరుమలరెడ్డి (42) హత్య కేసును గుంతకల్లు రూరల్ పోలీసులు ఛేదించారు. ముందుగా ట్రాక్టర్‌తో ఢీకొట్టిన అనంతరం హంద్రీ-నీవా కాలువలో పడేసినట్లు గుర్తించారు. గురువారం కసాపురం పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రూరల్ సీఐ ఎన్.ప్రవీణ్ కుమార్ వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన మేరకు.. కర్నూలు జిల్లా మద్దికెరకు చెందిన తిరుమలరెడ్డి గుంతకల్లులోని తిలక్‌నగర్‌లో నివాసముంటున్నాడు. 'బీవీఆర్ న్యూస్ టుడే' పేరుతో యూట్యూబ్ చానల్ నిర్వహించేవాడు. గుంతకల్లు మండలం సంగాల గ్రామానికి చెందిన జీవన్ కుమార్ తన నాలుగెకరాల పొలం పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటుండగా, ఈ విషయమై తిరుమలరెడ్డి, జీవన్‌కుమార్‌కు మధ్య వివాదం చోటుచేసుకుంది. తనకు డబ్బు ఇవ్వకుంటే కథ చూస్తానంటూ అతడిని తిరుమలరెడ్డి వేధించేవాడు. దీంతో ఒప్పందం కుదుర్చుకుని కొంత డబ్బును జీవన్‌కుమార్ చెల్లించాడు. అయితే, అక్కడితో ఆగకుండా తహసీల్దార్‌కు తిరుమలరెడ్డి ఫిర్యాదు చేయడంతో కక్ష పెంచుకున్నాడు. సంగాలకు చెందిన బోయ రామాంజినేయులు, కసాపురానికి చెందిన బోయ రామన్నతో కలిసి తిరుమలరెడ్డి హత్యకు పథకం రచించాడు. ఈ నెల 17న ఉదయం తన ఇంటి నుంచి బైకుపై పొలానికి బయలుదేరిన తిరుమలరెడ్డి కసాపురం సమీపంలోని హంద్రీ-నీవా కాలువ బ్రిడ్జి వద్దకు చేరుకోగానే ఒక్కసారిగా ట్రాక్టర్‌తో బలంగా ఢీ కొట్టారు. దీంతో స్పృహ కోల్పోయిన తిరుమలరెడ్డిని ఈడ్చుకుంటూ తీసుకెళ్లి కాలువలో పడేసి పరారయ్యారు. మృతుడి భార్య రామేశ్వరి ఫిర్యాదు మేరకు డీఎస్పీ ఏ.శ్రీనివాస్ నేతృత్వంలో ముమ్మరంగా విచారణ చేపట్టినట్లు సీఐ తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలో నిందితులు ముగ్గురినీ అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని వారు అంగీకరించారన్నారు. హత్యకు ఉపయోగించిన ట్రాక్టర్‌తోపాటు ద్విచక్రవాహనం, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు. కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన కసాపురం ఎస్ఐ వెంకటస్వామితోపాటు సిబ్బందిని డీఎస్పీ అభినందినట్లు సీఐ తెలిపారు.

● పరమేశ్వరా..పాహిమాం



విద్యుద్దీపాలంకరణలో నూతన శోభ సంతరించుకున్న అనంతపురంలోని కాశీవిశ్వేశ్వరాలయం

పరమేశ్వరా.. పరంధామ పాహిమాం.. అంటూ భక్తుల నామస్మరణతో శైవాలయాలు ప్రతిధ్వనిస్తున్నాయి. శివాలయాల్లో మహా శివ రాత్రి శోభ నెలకొంది. అనంతపురం మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. గురువారం రాత్రి పార్వతీ పరమేశ్వరులు వ్యాఘ్ర వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా కళాకారుల భక్తి గీతాలాపన, కోలాట ప్రదర్శనలతో సందడి నెలకొంది.

- తాడిపత్రి మండలంలోని బుగ్గ రామలింగేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాలకు గురువారం భక్తిశ్రద్ధలతో శ్రీకారం చుట్టారు. ఆలయంలో పార్వతీ సమేత స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

–అనంతపురం కల్చరల్/ తాడిపత్రి రూరల్



అనంతపురంలో వ్యాఘ్రవాహనంపై ఊరేగుతున్న పరమేశ్వరుడు



తాడిపత్రి బుగ్గ ఆలయంలో ఉత్సవమూర్తులకు పూజలు

రమేష్‌గౌడ్‌కు ఇంటర్నేషనల్ అవార్డ్



అవార్డు అందుకుంటున్న రమేష్‌గౌడ్

అనంతపురం ఎడ్యుకేషన్: కులమతాలకు అతీతంగా 13 ఏళ్లుగా నిస్వార్థంగా సేవలందిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, టాస్క్‌ఫోర్స్ సభ్యుడు, బీసీ కులాల ఐక్య వేదిక నాయకుడు చిట్లూరు రమేష్‌గౌడ్‌కు ప్రపంచస్థాయి గుర్తింపు లభించింది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్' సంస్థ ప్రతిఏటా ప్రతిష్టాత్మకంగా అందజేసే 'ఇంటర్నేషనల్ ఎక్స్‌లెన్సీ అవార్డ్స్'ను ఆయన అందుకున్నారు. వివిధ విభాగాల్లో దేశవ్యాప్తంగా దాదాపు 20 మంది ఎంపిక కాగా, ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికైన ఏకైక వ్యక్తి రమేష్‌గౌడ్ కావడం విశేషం. 'నిస్వార్థ సేవలు, ప్రజలను ఎక్కువగా ప్రభావితం' కేటగిరీ నుంచి అవార్డుకు ఎంపిక చేయడం గమనార్హం. దుబాయి వేదికగా బుధవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో రమేష్‌గౌడ్ అవార్డు అందుకున్నారు. నిరుపేదల వైద్యానికి, పేద విద్యార్థుల చదువులకు రమేష్‌గౌడ్ అండగా నిలిచారు. కోవిడ్ మహమ్మారి విజృంభించిన సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు దుస్తులు, మందులు, ఆహారం, నిత్యావసర సరుకులు తదితరాలు పంపిణీ చేశారు. తన సేవలతో యువతపై తీవ్ర ప్రభావం చూపుతున్నారని గుర్తించి అవార్డుకు ఎంపిక చేసినట్లు 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్' సంస్థ వెల్లడించింది. అవార్డు ప్రదానోత్సవంలో కేంద్రమంత్రి రామ్‌దాస్ అథవాలెతో పాటు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సీఈఓ సంతోష్ శుక్లా, దుబాయ్, చైనా, రష్యా, జర్మనీ తదితర దేశాల నుంచి ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రమేష్‌గౌడ్‌కు వైఎస్సార్‌సీపీ నాయకులు, బీసీ కులాల ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

40 మంది కార్యదర్శులకు మెమోలు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలోని వివిధ సచివాలయాల పరిధిలో విధులు నిర్వర్తించే 40 మంది వెల్ఫేర్ కార్యదర్శులకు కమిషనర్ బాలస్వామి గురువారం మెమోలు జారీ చేశారు. సమయపాలన పాటించకపోవడంతో ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. 24 గంటల్లో వివరణ ఇవ్వాలని కమిషనర్ సంబంధిత వెల్ఫేర్ కార్యదర్శులను ఆదేశించారు.

క్లుప్తంగా

ఆటోను ఢీకొన్న కారు



బోల్తాపడిన ఆటో (వెనుక) ప్రమాదానికి కారణమైన కారు

పామిడి: మండలంలోని గజరాంపల్లి వద్ద 44వ జాతీయ రహదారిపై పెయింట్ డబ్బాలతో వెళుతున్న ఆటోను వెనుక నుంచి కారు ఢీకొంది. ఘటనలో ఆటో బోల్తాపడి అనంతపురానికి చెందిన ఆటో డ్రైవర్ రామకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడికి తొలుత పామిడి సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించి, అనంతపురానికి రెఫర్ చేశారు. గురువారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రమాదానికి కారణమైన హైదరాబాద్‌కు చెందిన వేణుగోపాల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. ఘటనలో దాదాపు రూ.2 లక్షల విలువైన సరుకు రోడ్డు పాలైందని ఆటో డ్రైవర్ తెలిపాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పోలీసులను బెదిరించిన వారిపై కేసు నమోదు

బెళుగుప్ప: పోలీసులను బెదిరించిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు బెళుగుప్ప ఎస్ఐ శివ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తగ్గుపర్తి రోడ్డు సమీపంలోని విండ్ పవర్ స్టేషన్ వద్ద బుధవారం బహిరంగ మద్యపానం చేస్తూ నిఖిల్ అనే యువకుడు గస్తీ నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ బాలనరసింహులు, జనార్దన్, వెంకటేశ్‌నాయక్‌కు పట్టుపడ్డాడు. దీంతో నిఖిల్‌ను పీఎస్‌కు తరలించి, కౌన్సెలింగ్ ఇచ్చారు. విషయం తెలుసుకున్న నిఖిల్‌కు వరసకు అన్న అయిన శివశంకర్... పీఎస్‌కు చేరుకుని పోలీసు సిబ్బందిని దుర్భాషలాడాడు. అంతేకాక తన తమ్ముడిని స్టేషన్‌కు పట్టుకెళ్లిన వారు మండలంలో ఎలా తిరుగుతారో తాను చూస్తానంటూ బెదిరింపులకు దిగాడు. దీంతో హెడ్‌కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు నిఖిల్, శివశంకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

హోరాహోరీగా రాతిదూలం లాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

గుంతకల్లు: మండలంలోని వెంకటాంపల్లిలో వెలసిన పెద్ద కదిరప్పస్వామి రథోత్సవంలో భాగంగా గురువారం నిర్వహించిన రాతి దూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. దాదాపు 9 జతల వృషభాలను రైతులు తీసుకువచ్చారు. అనంతపురం రూరల్ మండలం అక్కంపల్లికి చెందిన రైతు ఇంద్రారెడ్డి వృషభాలు మొదటి స్థానంలో నిలిచాయి. రెండో స్థానాన్ని తాడిపత్రికి చెందిన రైతు రాజశేఖర్‌రెడ్డి వృషభాలు, మూడో స్థానాన్ని పెద్దవడుగూరు మండలం లక్షుంపల్లికి చెందిన రైతు శివారెడ్డి వృషభాలు, నాల్గో స్థానాన్ని నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం డి.రంగాపురం గ్రామానికి చెందిన రైతు రామకృష్ణారెడ్డి వృషభాలు దక్కించుకున్నాయి. విజేత వృషభాల యజమానులను అభినందిస్తూ నిర్వాహకులు నగదు పురస్కారాలతో సత్కరించారు.

ఆత్మ విశ్వాసం కోల్పోకుండా సాధన చేస్తే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించారు ఆత్మకూరుకు చెందిన సాధారణ రైతు బిడ్డలు. అంధ విశ్వాసాలు వెంటాడి గేలి చేస్తున్నా గ్రామీణ ప్రాంతానికి చెందిన బాలికలు వెనుకంజ వేయలేదు. బాల్ కొడితే.. గోల్ పడాల్సిందే నంటూ జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఆత్మకూరుకు చెందిన బాలికలు ఎంపికయ్యారు.

బాల్ కొడితే.. గోల్ పడాల్సిందే



జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

- గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదిగిన ఆత్మకూరు బాలికలు
- అందరూ సాధారణ రైతు కుటుంబాలకు చెందిన వారే

ఆత్మకూరు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విష్ణుప్రణవి, అస్మిత, శ్వేత, రియాన్షిక సాయి, కీర్తిలక్ష్మి.. ఫుట్‌బాల్ క్రీడలో రాణిస్తున్నారు. ఇప్పటికే ఈ పాఠశాలలో చదివిన మందల అనూష భారత మహిళా ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైన విషయం తెలిసిందే. అదే బాటలో మరికొందరు పయనిస్తూ మరికొందరు ఆత్మకూరు ఖ్యాతిని జాతీయ స్థాయిలో రెపరెపలాడించనున్నారు.

సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చి...

జాతీయ స్థాయిలో ప్రాతినిథ్యం వహించే ఏపీ జట్టులో చోటు దక్కించుకున్న విష్ణుప్రణవి, అస్మిత, శ్వేత, రియాన్షిక సాయి, కీర్తిలక్ష్మి.. సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన వారే కావడం విశేషం. చిన్నప్పటి నుంచి ఫుట్‌బాల్ క్రీడపై ఆసక్తి పెంచుకున్న వారు నిరంతర సాధనతో తాము అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. రోజూ ఉదయం, సాయంత్రం క్రమం తప్పని సాధన వారిని ఫుట్‌బాల్ క్రీడలో మెరికలుగా మార్చేసింది. ప్రతిభకు పేదరికం అడ్డురాదని... అనుకుంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించారు. అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ ఏడాది జనవరి 27 నుంచి ఈ నెల 10వ తేదీ వరకు అనంతపురంలోని ఆర్డీటీ స్పోర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు అండర్-13 విభాగంలో పాల్గొని తమ సత్తాను నిరూపించుకుని జాతీయ స్థాయికి ఎంపికయ్యారు.

గర్వంగా ఉంది



ఫుట్‌బాల్ ఆడాలంటే మొదట్లో భయపడే వాళ్లం. అయితే రోజూ క్రమం తప్పకుండా ప్రాక్టీస్ చేయడంతో మాలోని బెరుకు దూరమైంది. ఈ రోజు జాతీయ స్థాయిలో ఆడబోతున్నామంటే మా తల్లిదండ్రులతో పాటు మాకూ ఎంతో ఆనందంగా ఉంది. అమ్మ, నాన్న కష్టాన్ని వృథాకానివ్వం.

– రియాన్షిక సాయి, కీర్తిలక్ష్మి, 7వ తరగతి, జెడ్పీహెచ్‌ఎస్, ఆత్మకూరు

ఆర్డీటీ సహకారంతోనే..



బాలికలకు చదువెందుకు అంటూ కట్టుబాట్ల పేరుతో కట్టడి చేసే ప్రాంతం మాది. అయినా మా అమ్మానాన్న ఎంతో కష్టపడుతూ చదివిస్తున్నారు. వారి కష్టం వృథా కాకూడదని చదువుతో పాటు ఫుట్‌బాల్ క్రీడలోనూ నేను రాణించా. మమ్మల్ని ఈ స్థాయికి ఎదిగించిన ఆర్డీటీ సహకారం ఎన్నటికీ మరువలేను. ఆర్డీటీ క్రీడా మైదానంలో రోజూ సాధన చేస్తుంటా. మా కోచ్‌లు కూడా ఎంతో నిబద్ధతతో క్రీడలోని మెలకువలు నేర్పిస్తున్నారు.

– అస్మిత, 7వ తరగతి, జెడ్పీహెచ్‌ఎస్, ఆత్మకూరు

జాతీయ స్థాయిలో ఆడా



ఫుట్‌బాల్ అంటే నాకు చాలా ఇష్టం. రోజూ ఉదయం సాయంత్రం తప్పకుండా ప్రాక్టీస్ చేస్తా. 2015లో తొలిసారి జాతీయ స్థాయి మధ్యప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన్నా. ఆ తర్వాత మణిపూర్‌లో జరిగిన జాతీయ స్థాయి ఫుట్‌బాల్ టోర్నీలోనూ ఏపీ జట్టు తరఫున ఆడాను. ఇప్పుడు మూడోసారి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయినందుకు ఎంతో సంతోషంగా ఉంది.

– విష్ణుప్రణవి, 8వ తరగతి, జెడ్పీహెచ్‌ఎస్, ఆత్మకూరు

అమ్మానాన్నల కష్టం వృథా కాదు



మాది వ్యవసాయ కుటుంబం. అమ్మానాన్న ఎంతో పట్టుదలతో నన్ను చదివిస్తున్నారు. వారి కష్టం వృథా కాకుండా చదువుతో పాటు క్రీడల్లోనూ నేను రాణిస్తున్నా. క్రీడా కోటా కింద ప్రభుత్వ ఉద్యోగం సాధించి వారి కష్టాలను తీరుస్తా.

– శ్వేత, 7వ తరగతి, జెడ్పీహెచ్‌ఎస్, ఆత్మకూరు

మా విద్యార్థులకు తిరుగులేదు



నేను 2015లో ఆత్మకూరులోని జెడ్పీహెచ్‌ఎస్‌లో కాంట్రాక్ట్ విధానంలో పీఈటీగా బాధ్యతలు స్వీకరించా. అప్పుడు పీడీ రాజశేఖర్‌రెడ్డి ఉండేవారు. ఆయన, నేను కలసి పిల్లలకు వివిధ రకాల ఆటలు నేర్పించేవాళ్లం. పాఠశాలలో అందరి సహకారమూ ఉంది. 2015 నుంచి ఇప్పటి వరకూ 98 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయికి, 28 మంది విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపిక అయ్యారు. కబడ్డీ, క్రికెట్, ఫుట్‌బాల్, ఖోఖో, యోగా కాకుండా అథ్లెటిక్స్‌లోనూ మా విద్యార్థులకు తిరుగు లేదు.

– గోవర్ధన్, పీఈటీ, జెడ్పీహెచ్‌ఎస్, ఆత్మకూరు

నిరుద్యోగులపై 'కూటమి' కపటప్రేమ

- ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష్‌కుమార్



మాట్లాడుతున్న సంతోష్‌కుమార్

అనంతపురం అర్బన్: రాష్ట్రంలోని నిరుద్యోగులపై కూటమి ప్రభుత్వం కపట ప్రేమ చూపుతోందని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష్‌కుమార్ మండిపడ్డారు. ఇప్పటికైనా ఈ తరహా నాటకాలకు స్వస్తి చెప్పి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలంటూ డిమాండ్ చేశారు. అనంతపురంలోని ఆ సంఘం కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు పూర్తవుతున్నా నిరుద్యోగ యువతకు చేసిన మేలు ఏమీ లేదన్నారు. హామీలను నెరవేర్చకుండా యువతను మాటలతో సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ చర్యలను ఇక సహించేది లేదన్నారు. అమరావతిని ఫ్రీజోన్ చేసి అక్కడ భర్తీ చేసే ఉద్యోగ నియామకాల్లో 26 జిల్లాల నిరుద్యోగులకు సమాన అవకాశం కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, ఇతర శాఖల్లో ఖాళీ పోస్టులకు జాబ్ క్యాలెండర్ ప్రకటించి భర్తీ చేయాలన్నారు. వలంటీర్ వ్యవస్థను కొనసాగించి రూ.10 వేలు గౌరవవేతనం ఇవ్వాలన్నారు. ఇలా మొత్తం 32 తీర్మానాలను ప్రభుత్వం ముందు ఉంచబోతున్నామన్నారు. వీటిపై ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కోట్రేష్, ఉపాధ్యక్షుడు దేవేంద్ర, సహాయ కార్యదర్శి ధనుంజయ, కోశాధికారి శ్రీనివాస్, ఉరవకొండ మండల కార్యదర్శి నవీన్, తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు రాయితీతో ఫ్రూట్ కవర్లు

- శిక్షణా కార్యక్రమంలో డీహెచ్‌ఓ నరసింహారావు



శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు ఎఫ్‌పీఓ, ఎన్‌జీఓ ప్రతినిధులు

అనంతపురం అగ్రికల్చర్: నాణ్యమైన మామిడి దిగుబడుల కోసం ఇటీవల కొత్తగా రాయితీతో అందిస్తున్న ఫ్రూట్ కవర్ల (రక్షణ కవచం)ను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు ఉద్యానశాఖ డీడీ బీఎంవీ నరసింహారావు సూచించారు. ఫ్రూట్ కేర్ యాక్టివిటీపై గురువారం అనంతపురంలోని ప్రాంతీయ శిక్షణా కేంద్రంలో మామిడి రైతులతో పాటు ఎఫ్‌పీఓలు, ఎన్‌జీఓలకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మామిడితోటల్లో కాయలు నిమ్మకాయ, కోడిగుడ్డు సైజులో ఉన్నప్పుడు గాలిచొరబడకుండా తొడిమ వరకు కవర్లు కట్టాలని తెలిపారు. ఫ్రూట్ కవర్ వాడటం వల్ల ఊజీ ఈగ, తేనెమంచు పురుగు, మచ్చలు, తామర పురుగుల నుంచి రక్షణ ఉంటుందన్నారు. అలాగే అధిక సూర్యరశ్మి, వడగండ్ల వాన నుంచి కూడా కాపాడుకోవచ్చన్నారు. ఎలాంటి క్రిమికీటకాలు పండ్లను నాశనం చేయకుండా నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని తెలిపారు. తొడిమ కూడా ధృఢంగా తయారై కాయ పరిమాణం కూడా పెరుగుతుందన్నారు. ఒక్కో కవర్ రూ.2 కాగా 50 శాతం రాయితీతో గరిష్ఠంగా ఒక హెక్టారుకు రూ.10 వేలు వరకు రాయితీ వర్తిస్తుందన్నారు. ఎఫ్‌పీఓలు, ఎన్‌జీఓలు సహకరిస్తే మామిడి రైతులకు మేలు జరుగుతుందన్నారు. శిక్షణా కార్యక్రమంలో ఏఎఫ్ ఎకాలజీ, కార్డు, జీటీ, రెడ్స్, ఏపీమాస్ తదితర ఎన్‌జీఓ, ఎఫ్‌పీఓ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళపై వేట కొడవలితో దాడి

అనంతపురం: స్థానిక పాతూరులోని చెన్నకేశవ స్వామి ఆలయం సమీపంలో నివాసముంటున్న హేమలతపై మంగలి బాలఓబులేసు అనే వ్యక్తి విచక్షణారహితంగా దాడి చేశాడు. గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. వందలాది మంది చూస్తుండగా వేటకొడవలితో వెంటాడి తీవ్రంగా గాయపరిచాడు. పోలీసులు తెలిపిన మేరకు... నార్పల మండలం బొందలవాడ గ్రామానికి చెందిన హేమలత భర్త కొంత కాలం క్రితం మృతి చెందాడు. ఇద్దరు పిల్లలు ఉన్నారు. అనంతపురంలోని అత్త, మామ వద్ద పిల్లలు ఉంటూ చదువుకుంటున్నారు. కొంత కాలంగా హేమలతకు మంగలి బాలఓబులేసుతో పరిచయం ఉంది. ఈ క్రమంలో ఆమె మరొకరితో సన్నిహితంగా ఉంటోందని అనుమానించిన బాలఓబులేసు వేటకొడవలితో దాడికి తెగబడ్డాడు. ప్రస్తుతం ఆమె విషమ పరిస్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. దాడికి పాల్పడిన బాల ఓబులేసును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై విచారణ కొనసాగుతోందని సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీల్లో జిల్లా వాసులు




అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రైతు, బీసీ, పంచాయతీరాజ్, బూత్ కమిటీల్లో జిల్లాకు చెందిన పలువురికి చోటు దక్కింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటన విడుదల చేసింది. వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శులుగా తరిమెల వంశీగోకుల్‌రెడ్డి, చౌల మల్లయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధిగా భాస్కరరెడ్డి, సహాయ కార్యదర్శిగా ఆలేరి రాజగోపాల రెడ్డి, వాచిపల్లి నరేంద్రరెడ్డికి చోటు దక్కింది. బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా గోగుల పుల్లయ్య, తలారి వెంకటేశులు, సహాయ కార్యదర్శులుగా కురుబ శ్రీనివాసులు, ఎంఏ నవీన్‌కుమార్, పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా బెడదల మదన్‌మోహన్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా ఎం.బసవ రాజు, షేక్ సాదిక్ వలి, బూత్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గోగుల రాధాకృష్ణ నియమితులయ్యారు.

రేషన్ బియ్యం పట్టివేత

కణేకల్లు: అక్రమంగా కణేకల్లు నుంచి ఐచర్ వాహనంలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కణేకల్లు నుంచి గురువారం కర్ణాటకకు రేషన్ బియ్యం తరలిస్తున్నట్లుగా సమాచారం అందుకున్న అనంతపురం విజిలెన్స్ సీఐ శ్రీనివాసులు, తన సిబ్బందితో కలసి తనిఖీలు చేపట్టారు. ఐచర్ వాహనాన్ని సీజ్ చేసి, పీఎస్‌కు తరలించారు. 270 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యం తరలిస్తున్న వేణుగోపాల్‌తో పాటు మరో వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

ఆర్టీసీలో అక్రమాల గంప'గుత్తి'

- ఒక్క గుత్తి డిపోలోనే లక్షలాది రూపాయల చేతివాటం
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన
- అధికారులు ఆరా తీయడంతో తిరిగి చెల్లించిన వైనం



డబ్బును తిరిగి జమ చేస్తున్నట్లు అధికారులకు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాసిచ్చిన పత్రం

అనంతపురం క్రైం: గుత్తి ఆర్టీసీ డిపోలో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఆర్.వరప్రసాద్ బాబు అలియాస్ ఆర్‌వీపీ బాబు అక్రమాలు బహిర్గతమయ్యాయి. గుత్తి డిపోకు సంబంధించిన ఆర్టీసీ బస్సులకు చెల్లించే టోల్ గేటు సొమ్ములో రూ.1,96,290ను సంస్థకు చెల్లించలేదు. ఆలస్యంగా ఈ విషయాన్ని పసిగట్టిన తోటి ఉద్యోగులు వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అప్రమత్తమైన ఉన్నతాధికారి సదరు అధికారిని రక్షించేందుకు విషయాన్ని గుట్టుగా దాచేసి, రికవరీ చేయాలని ఆదేశించారు. దీంతో వారం రోజుల గడువునిస్తూ వాడుకున్న డబ్బును తిరిగి సంస్థ బ్యాంక్ ఖాతాలో జమ చేయాలని డిపో ఉన్నతాధికారులు తాకీదు జారీ చేశారు. దీంతో తాను స్వాహా చేసిన మొత్తాన్ని రెండు విడతలుగా ఆయన బ్యాంక్‌లో జమ చేసి, చేతులు దులుపుకున్నాడు. ఇక్కడితో ఏమీ జరగనట్లు అధికారులు మిన్నకుండిపోయారు. అక్రమార్కుడిపై ఎలాంటి చర్యలు చేపట్టకపోడం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. వాస్తవానికి 2024 ఆగస్టు నుంచి టోల్ గేటుకు చెల్లించాల్సిన సొమ్మును పలు దఫాలుగా వాడుకున్నట్లు అధికారులు రికార్డు పరంగా గుర్తించారు. ఈ చర్య వల్ల ఆర్టీసీకి రూ.3 లక్షల జరిమానా రూపంలో పడినట్లుగా సమాచారం. ఈ క్రమంలో ప్రసాద్ నుంచి ఉన్నతాధికారులు భారీగా ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలు న్నాయి.

ఒకటికి పదింతలు వసూలు చేయాలి

ఆర్టీసీలో నిబంధనల ప్రకారం నగదు కార్యకలాపాలకు సంబంధించి ఉద్యోగి, కార్మికుడు ఏరోజుకారోజు చెల్లింపులు జరపాలి. అలా చెల్లించని పక్షంలో మరుసటి రోజు రూ.10కి పదింతలు అధికంగా రూ.110 చెల్లించాల్సి ఉంటుంది. అలా కట్టినప్పుడే విధులకు అనుమతిస్తారు. ఈ నిబంధన అందరికీ వర్తిస్తున్నా ఆర్ఎం సుమంత్.ఆర్. ఆదోని అస్మదీయులకు మాత్రం వర్తించడం లేదు. తాజాగా ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ ఆర్‌వీపీ బాబు విషయంలోనూ ఇదే బహిర్గతమైంది.

జాప్యం జరిగింది

నేను సంస్థ సొమ్ము రూపాయి కూడా వాడుకోలేదు. జాతరలు, పండుగలు నేపథ్యంలో అదనంగా బస్సులు తిప్పాం. ఆ సమయంలో టోల్ గేట్ చెల్లింపులు తదితర వాటి కోసం డబ్బు చెల్లింపులు జరిగాయి. ఈ క్రమంలోనే కాస్త జాప్యం జరిగింది అంతే.

– ఆర్‌వీ ప్రసాద్‌బాబు, డిపో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

అలాంటిదేమి జరగలేదు

గుత్తి డిపోలో టోల్‌గేటు చెల్లింపులకు సంబంధించి ఎలాంటి పొరపాటు జరగలేదు. టోల్ డబ్బులు కట్టించుకోలేదు. యాజమాన్యం మారిపోవడం వల్ల ఈ సమస్య తలెత్తింది. తిరిగి కట్టేశారు.

– గంగాధర్, ఇన్‌చార్జ్ డీఎం

హజ్ యాత్రికులకు అవగాహన తరగతులు

అనంతపురం కల్చరల్: జిల్లా నుంచి హజ్‌కు వెళ్తున్న యాత్రికులకు ఈ నెల 22 నుంచి ప్రతి శని, ఆదివారాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు హాజీ ఖాదిమ్ మహమ్మద్ రఫీ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. అనంతపురంలోని పీటీసీ ఎదురుగా ఉన్న చాందినీ మసీదులో ఉదయం 10 నుంచి 11 .30 గంటల వరకు అవగాహన తరగతులుంటాయి. హజ్ విధివిధానాలను తెలియజేసే పుస్తకాలను సైతం అందిస్తారు. మహిళలకు పర్దా సౌకర్యం ఉంటుంది. ఆసక్తి ఉన్న వారు పూర్తి వివరాలకు 94409 83090, 86885 26178లో సంప్రదించవచ్చు.

మట్కా బీటర్ల అరెస్ట్

రాయదుర్గం: స్థానిక రూరల్ సర్కిల్ పరిధిలోని డి.హీరేహాళ్, కణేకల్లు, బొమ్మనహాళ్, గుమ్మఘట్ట మండలాల్లో గురువారం పోలీసులు చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో పలువురు మట్కా బీటర్లు పట్టుబడ్డారు. వివరాలను సీఐ వెంకటరమణ వెల్లడించారు. బొమ్మనహాళ్ మండలంలోని వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్టు వద్ద బళ్లారికి చెందిన మట్కా నిర్వాహకుడు ఇమ్రాన్ పట్టుబడ్డాడు. రూ.50,500 నగదుతో పాటు మట్కా పట్టీలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే కణేకల్లు పీఎస్ పరిధిలోని అంబాపురం గేటు వద్ద పాపసాని సత్యనారాయణరెడ్డిని అరెస్ట్ చేసి రూ.41,980 నగదు, మట్కా పట్టీలు స్వాధీనం చేసుకున్నారు. డి.హీరేహాళ్ మండలం నాలాలపురం శివారులో మట్కా రాస్తూ ఎర్రిస్వామి, నారాయణ, లాలూస్వామి, కల్యం గ్రామానికి చెందిన బోయ లక్ష్మన్న పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.64,865 స్వాధీనం చేసుకున్నారు. గుమ్మఘట్ట మండలం పూలకుంటలో మట్కా రాస్తున్న వడ్డే వన్నూరుస్వామి, వడ్డే హరిని అరెస్ట్ చేసి రూ.25 వేలు నగదు, మట్కా పట్టీలు స్వాధీనం చేసుకున్నారు. బీటర్ల అరెస్ట్‌లో చొరవ చూపిన ఎస్ఐలు గురుప్రసాదరెడ్డి, నాగమధు, నబీరసూల్, ఈశ్వరయ్యను సీఐ వెంకటరమణ అభినందించారు.

లారీ ఢీ... వృద్ధుడి మృతి

గుత్తి రూరల్: మండలంలోని బసినేపల్లి శివారులో గురువారం రాత్రి లారీ ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి ఆర్ఎస్‌కు చెందిన విశ్రాంత పోస్ట్‌మెన్ మస్తాన్‌వలి (66) వ్యక్తిగత పనిపై గురువారం కర్నూలు జిల్లా జి.ఎర్రగుడి తండాకు వెళ్లాడు. అక్కడ పనిముగించుకుని రాత్రికి తిరుగు ప్రయాణమైన ఆయన ఆటో ఎక్కేందుకు రోడ్డు దాటుతున్న సమయంలో గుత్తి నుంచి పత్తికొండ వైపునకు వెళ్తున్న లారీ ఢీకొంది. ఘటనలో ఆయన రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స మొదలు పెట్టేలోపు ఆయన మృతి చెందాడు. కాగా, ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా దూసుకెళ్లడాన్ని గమనించిన స్థానిక యువకులు ద్విచక్ర వాహనాల్లో వెంబడిస్తూ కర్నూలు జిల్లా జొన్నగిరి గ్రామంలో పట్టుకున్నారు. మృతుడికి భార్య, నలుగురు కుమారులు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

యువకుడిపై కత్తితో దాడి



చికిత్స పొందుతున్న సతీష్

రాప్తాడు రూరల్: ఇంజినీరింగ్ విద్యార్థుల మధ్య జరిగిన గొడవలో ఓ యువకుడు కత్తిపోట్లకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఇటుకలపల్లికి చెందిన సిద్ధార్థ్... అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో ఫైనలియర్ చదువుతున్నాడు. కందుకూరు గ్రామానికి చెందిన ప్రభాస్ కూడా ఇదే కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. వీరిద్దరి మధ్య ఇటీవల కళాశాలలో గొడవ జరిగింది. విషయాన్ని ప్రభాస్ తన గ్రామంలోని స్నేహితుల దృష్టికి తీసుకెళ్లాడు. ఈ నేపథ్యంలో గురువారం సిద్ధార్థ్ స్నేహితుడు సతీష్ పుట్టిన రోజు కావడంతో మధ్యాహ్నం స్నేహితులందరూ కలసి అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల వెనుక బర్త్‌డే పార్టీ ఏర్పాటు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న ప్రభాస్, అతని స్నేహితులు అక్కడికి చేరుకుని, సిద్ధార్థ్‌తో గొడవకు దిగారు. సర్ది చెప్పే ప్రయత్నం చేసిన బర్త్‌డే బాయ్ సతీష్‌పై కత్తితో దాడి చేసి, అక్కడి నుంచి ఉడాయించారు. క్షతగాత్రుడిని వెంటనే అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ విజయ్‌కుమార్ ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. తర్వాత ఆస్పత్రికి వెళ్లి బాధితుడు సతీష్‌తో మాట్లాడి స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యువకుడి ఆత్మహత్య

లేపాక్షి: పెళ్లి కాలేదన్న దిగాలుతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... లేపాక్షి మండలం కుర్లపల్లికి చెందిన రామాంజినేయులు (26)కు కుటుంబసభ్యులు పెళ్లి ప్రయత్నాలు చేపట్టారు. అయితే ఏ సంబంధమూ కుదరలేదు. దీంతో తనకు పెళ్లి చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటానంటూ తరచూ తల్లిదండ్రులతో గొడవపడేవాడు. ఈ నేపథ్యంలో ఇక తనకు పెళ్లి కాదేమోనని దిగాలుతో గురువారం ఉదయం లేపాక్షి చెరువు కట్టపై ఉన్న చింత చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రమాదంలో మున్సిపల్ కార్మికుడి మృతి

పావగడ: స్థానిక శని మహాత్మ సర్కిల్‌లో చోటు చేసుకున్న ప్రమాదంలో మున్సిపల్ కార్మికుడు మంజునాథ్ (40) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గురువారం ఉదయం 11 గంటల సమయంలో సర్కిల్ వద్ద రోడ్డు పక్కన చెత్తను శుభ్రం చేస్తుండగా ఎస్ఎస్‌కే సర్కిల్ నుంచి ఆర్‌జీ సర్కిల్ వైపు వేగంగా వెళుతున్న ట్రాక్టర్ ఢీకొంది. ట్రాక్టర్ టైర్ తగలడంతో మంజునాథ్ తలకు బలమైన రక్తగాయమైంది. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ వాహనాన్ని వదిలేసి పారిపోయాడు. క్షతగాత్రుడిని స్థానికులు వెంటనే అంబులెన్స్ ద్వారా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తుమకూరు జిల్లాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు.

క్లుప్తంగా

డీఆర్ఓపై చర్యలు తీసుకోరా?



కలెక్టర్ వినోద్ కుమార్‌తో మాట్లాడుతున్న జేఏసీ అధ్యక్షుడు హరి

అనంతపురం అర్బన్: ఎస్సీ ఏకసభ్య కమిషన్ నిర్వహించిన సమావేశంలో ఆన్‌లైన్‌లో పేకాట ఆడిన డీఆర్‌ఓపై చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి మండిపడ్డారు. గురువారం కలెక్టర్ వి.వినోద్ కుమార్‌ను కలిసి డీఆర్‌ఓపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. డీఆర్‌ఓపై చర్యలు తీసుకోవడంలో ఎందుకు జాప్యం జరుగుతోందని అడిగారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ.. నివేదికను ప్రభుత్వానికి పంపించామని చెప్పారు. చర్యలు అక్కడి నుంచే తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, రామకృష్ణ, వెంకటేష్, రామ్మోహన్, రామాంజనేయులు, బాబు, రామచంద్ర, గోపాల్, పాల్గొన్నారు.

అనంత సేవకులకు సత్కారం



సామాజిక సేవాకార్యకర్తలను సన్మానిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం కల్చరల్: ఏ కష్టమొచ్చినా మేమున్నామంటూ ఆదుకుంటున్న పలువురు సామాజిక సేవాకార్యకర్తలను ఐఎంఎం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. గురువారం స్థానిక లలిత కళాపరిషత్తులో జరిగిన కార్యక్రమంలో ఐఎంఎం అధ్యక్షుడు మహబూబ్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడారు. కరోనా విపత్కర సమయంలో అనంత స్వచ్ఛంద సంస్థలు చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. అటువంటి వారిని గుర్తించిన ఐఎంఎం నిర్వాహకుల కృషి అభినందనీయమన్నారు. అనంతరం సమాజ సేవకులకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు.

పాఠశాల తనిఖీ



విద్యార్థులతో చదివిస్తున్న ఎంఈఓ రామాంజనేయులు

ఆత్మకూరు: విద్యార్థులందరూ పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓ–2 రామాంజనేయులు సూచించారు. గురువారం మండలంలోని తోపుదుర్తి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. భోజనం రుచికరంగా నాణ్యతగా ఉండాలని తెలిపారు. అనంతరం తరగతి గదిలో పిల్లలకు సబ్జెక్టుల పరంగా ఎంత మేరకు సామర్థ్యం ఉందో పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. కొంత మందితో బోర్డు మీద రాయించారు. వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.

సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు



అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న ఎంపీడీఓ దివాకర్, తదితరులు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండల పరిధిలో వివిధ కార్పొరేషన్ల కింద సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 866 మంది దరఖాస్తు చేసుకోగా.. తొలిరోజు 361 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఎంపీడీఓ దివాకర్, ఈఓఆర్డీ వెంకటనాయుడు, వివిధ బ్యాంకుల నుంచి హాజరైన ప్రతినిధుల సమక్షంలో ఇంటర్వ్యూలు జరిగాయి. ఉదయం నుంచి ఎంపీడీఓ కార్యాలయం నిరుద్యోగ అభ్యర్థులతో కిటకిటలాడింది. చివరిరోజు శుక్రవారం మిగిలిన అభ్యర్థులు హాజరుకావాలని ఎంపీడీఓ సూచించారు.

- అహర్నిశలు శ్రమించి ప్రభుత్వ కొలువులు సాధించిన అంధులు
- వైకల్యాన్ని ఎదురించి ఉన్నతస్థాయికి..
- ఆదర్శంగా నిలుస్తున్న అంధ ఉద్యోగులు

అంధులు కాదు.. అసాధ్యులు

ఆత్మకూరు: కళ్లు కనిపిస్తున్నా చాలా మంది అనుకున్న లక్ష్యాలను సాధించడంలో విఫలమవుతుంటారు. లక్ష్య సాధనకు కనీసం ప్రయత్నం చేయని వారు అనేకం. అయితే పుట్టుకతోనే అంధుడైనప్పటికీ తలరాతను మార్చుకున్నారు కూడేరు మండలం ముద్దలాంపురం గ్రామానికి చెందిన మన్యపూల చంద్రయ్య. రేడియోలో ప్రసారమైన కథనం ఆయన్ను చదువుకునేలా ప్రోత్సహించింది. బ్రెయిలీ లిపితో ఏకంగా ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా కొలువు సాధించారు. ఇక ఆత్మకూరు మండలం సింగంపల్లి గ్రామానికి చెందిన శ్రీధర్‌బాబుకు పుట్టుకతోనే రెండు కళ్లు కనబడవు. పట్టుదలతో చదివి బ్యాంక్ ఉద్యోగం సాధించారు. అహర్నిశలు కృషి చేసి.. అంధులకు సాధ్యం కానిది అంటూ ఏదీ ఉండదని నిరూపించారు. సమాజంలో తమకుంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్న వీరిపై ప్రత్యేక కథనం..



కదిలించిన రేడియో కథనం..

కూడేరు మండలం ముద్దలాంపురం గ్రామానికి రాయప్ప, అంజినమ్మ దంపతులకు 14 మంది సంతానం. 8వ సంతానం మన్యపూల చంద్రయ్య. ఈయనకు పుట్టినప్పుడు కళ్లు కనిపించేవి. రెండు సంవత్సరాల తరువాత కళ్లు పూర్తిగా కనిపించకుండా పోయాయి. దీంతో ఇంట్లో వాళ్ల సహాయంతో పెరిగాడు. 10 సంవత్సరాల వయసు ఉన్నప్పుడు రేడియోలో అంధుల గురించి ఓ కథనం వచ్చింది. 'కళ్లు కనిపించకపోయినా అంధులు చదువగలరు.. సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకోగలరు' అని ప్రసారమైన కథనాన్ని విన్న చంద్రయ్యలో ఉత్సాహం వచ్చింది. బ్రెయిలీ లిపి ద్వారా 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు గుంటూరు జిల్లా నర్సరావుపేటలో చదివారు. ఇంటర్, డిగ్రీ అనంతపురంలో చదివారు. 1991 సంవత్సరంలో డీఈడీ కర్నూలులో పూర్తి చేశారు. 1993–95 సంవత్సరంలో ఎస్కే యూనివర్సిటీలో ఎంఏ పూర్తి చేశారు. 1995లో డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చింది. పరీక్ష రాయగా 1996లో టీచర్‌గా జాబ్ వచ్చింది. మొదట కూడేరు మండలం కొర్రకోడు గ్రామంలో ఉపాధ్యాయుడిగా బాధ్యతలు స్వీకరించారు. 2015లో ఆత్మకూరుకు తెలుగు ఉపాధ్యాయుడిగా వచ్చారు. 25 సంవత్సరాలుగా తెలుగు ఉపాధ్యాయుడిగా ఎంతో మందికి విద్యను బోధించి ప్రయోజకులను చేశారు. అంతేకాకుండా ఈయన సంగీతం, క్విజ్ పోటీల్లో ఎన్నో అవార్డులు, బహుమతులు గెలుచుకున్నారు.



పట్టుదలతో చదివి.. బ్యాంక్ కొలువు పట్టి

'ఆత్మకూరు మండలం సింగంపల్లి గ్రామానికి చెందిన శ్రీధర్‌బాబు 1992 సంవత్సరంలో వెంకటేశులు, యశోదమ్మకు జన్మించారు. శ్రీధర్‌బాబుకు పుట్టుకతోనే రెండు కళ్లు కనపడవు. అలా అని నిరుత్సాహానికి గురికాకుండా తల్లిదండ్రుల సహాయంతో బ్రెయిలీ లిపి ద్వారా విద్యను అభ్యసించారు. 1వ తరగతి నుంచి 5 వరకు కూడేరు ఆర్డీటీ పాఠశాలలో, 6వ తరగతి నుంచి 10 వరకు హిందూపురం ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో విద్యను అభ్యసించారు. ఇంటర్, డిగ్రీ హైదరాబాద్‌లో చదివారు. 2014 సంవత్సరంలో క్లర్క్‌గా ఉద్యోగం సాధించారు. అనంతరం 2015 సంవత్సరంలో ప్రమోషన్‌తో పీఓ (ప్రొబెషనరీ ఆఫీసర్)గా స్టేట్‌బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ బ్యాంక్‌లో చేరారు. అనంతరం స్కేల్–3 అధికారిగా ఎస్‌బీఐలో పని చేస్తున్నారు. కళ్లు లేకపోయినా సులభంగా సెల్‌ఫోన్ ఉపయోగించగలరు. ల్యాప్‌ట్యాప్‌ను ఆపరేట్ చేస్తారు. 'ఆర్డీటీ సంస్థతో పాటు తల్లిదండ్రులు తనకు కొండంత అండగా నిలిచారు' అని శ్రీధర్‌బాబు చెబుతున్నారు.

సర్వేకు ప్రజలు సహకరించాలి

అనంతపురం కార్పొరేషన్: పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్‌షిప్ (పీ4) ఎకనామికల్ గ్యాప్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ అండ్ పావర్టీ సర్వేకు నగర ప్రజలకు సహకరించాలని కమిషనర్ బాలస్వామి పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని 36వ డివిజన్ 52వ సచివాలయ పరిధిలో సీ16 క్లస్టర్‌లో జరుగుతున్న పీ4 సర్వేను పర్యవేక్షించారు. అక్కడ ఒక ఇంటి సభ్యుల వివరాలను కమిషనర్ స్వయంగా తెలుసుకున్నారు. సర్వే పట్ల ఎటువంటి అపోహలు వద్దని, 27 కాలమ్స్ వివరాలను సచివాలయ సిబ్బందికి తెలియజేయాలన్నారు. అదేవిధంగా సచివాలయ సిబ్బంది సర్వే ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలన్నారు.

ఆత్మకూరు: గ్రామాల్లో ప్రతి ఇంటికీ పీ4 సర్వే తప్పనిసరిగా చేయాలని ఎంఈఓ లక్ష్మీనరసింహ సచివాలయ ఉద్యోగస్తులకు సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ సచివాలయ ఉద్యోగస్తులతో సమావేశం నిర్వహించారు.



పబ్లిక్ సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ బాలస్వామి

ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. సర్వేలో భాగంగా ఇంట్లో గ్యాస్, టీవీలు, విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయా ? లేదా ? అన్న విషయాలను తెలుసుకోవాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఏ సమస్య ఉన్నా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

టెక్నాలజీని అందిపుచ్చుకోండి

అనంతపురం ఎడ్యుకేషన్: ఆధునిక టెక్నాలజీని నేటి తరం విద్యార్థులు అందిపుచ్చుకోవాలని అనంతపురం పార్లమెంట్ సభ్యుడు అంబికా లక్ష్మీనారాయణ సూచించారు. గురువారం స్థానిక ప్రభుత్వ బాలుర, బాలికల ఐటీఐలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనం నేర్చుకోవాలనే ప్రతి అంశమూ నేడు అందుబాటులో ఉందన్నారు. గూగుల్, యూట్యూబ్‌తో ప్రపంచం మొత్తం తెలుసుకోవచ్చన్నారు. అభివృద్ధి చెందుతున్న శాస్త్ర సాంకేతికతను అందిపుచ్చుకోలేని వాళ్లు జీవితంలో వెనుకబడిపోతారని హెచ్చరించారు. అనంతరం బాలుర ఐటీఐలో ఉన్న హాస్టల్ భవనాన్ని పరిశీలించారు. ఈ హాస్టల్‌ను వెంటనే అందుబాటులోకి తెచ్చేలా చూడాలని బీసీ సంక్షేమ శాఖ అధికారులకు సూచించారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లిన ఎంపీ విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి ఖుష్బూ కొఠారి, ఐటీఐ ప్రిన్సిపాల్ రామ్మూర్తి, ఉపాధ్యాయులు నందకుమార్, గాయత్రి దేవి, మురళీధర్, రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

వికలాంగులను కించపరిస్తే కఠిన చర్యలు

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో రూపొందించిన 'ది రైట్స్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజేబిలిటీస్' (ఆర్‌పీడబ్ల్యూడీ) తెలుగు అనువాద పుస్తకాన్ని గురువారం ఇటుకలపల్లి పీఎస్ ఎస్ఐ విజయ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లాల కో–ఆర్డినేటర్ హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ.. ఆర్‌పీడబ్ల్యూడీ చట్టాన్ని 2016 సంవత్సరంలో భారత పార్లమెంట్‌లో ఆమోదించారన్నారు. 2016 డిసెంబర్ 30 నుంచి ఈ చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. ఈ చట్టం ద్వారా వికలాంగులకు మూడు నుంచి నాలుగు శాతానికి రిజర్వేషన్ పెంచినట్లు పేర్కొన్నారు. సెక్షన్ 91(ఏ) ప్రకారం ఏ వికలాంగ




పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్ఐ విజయ్‌కుమార్

వ్యక్తినైనా కించపరిచే ఉద్దేశంతో అవమానించినా, భయపెట్టినా, దాడి చేసినా కనీసం 6 నెలల నుంచి 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు షఫీ, జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి రసూల్, ఎస్కే యూనివర్సిటీ వికలాంగ నాయకుడు కాలపరెడ్డి పాల్గొన్నారు.

నైతిక విలువలను పెంపొందిద్దాం

అనంతపురం కల్చరల్: జిల్లా కేంద్రంలో మూడు రోజుల పాటూ ఘనంగా నిర్వహించిన బాలోత్సవం సమీక్షా సమావేశం, ఆత్మీయ అభినందన సత్కారాలు గురువారం రాత్రి జరిగాయి. స్థానిక క్రిసెంట్ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో బాలోత్సవం కమిటీ చైర్‌పర్సన్ షమీమ్ షఫీవుల్లా మాట్లాడుతూ.. గత ఐదేళ్లగా బాలోత్సవం నిర్వహణకు ఎంతో మంది కృషి చేశారన్నారు. అయితే బాలల్లో నేర్చుకున్న నైతిక విలువలు కొనసాగేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. కేవలం మూడు రోజుల పండుగగా కాకుండా జీవితంలో స్ఫూర్తి పొందే అవకాశంగా బాలోత్సవం సాగాలన్నదే లక్ష్యమన్నారు. బాలోత్సవం సహ కార్యదర్శి ఐద్వా సావిత్రి మాట్లాడుతూ.. ఎంతో మంది చిన్నారుల్లోని ప్రతిభ పాటవాలు, సృజనాత్మకతను పెంచిన



బాలోత్సవ్ చైర్‌పర్సన్ షమీమ్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

బాలోత్సవం మధుర జ్ఞాపకాలను మిగిల్చిందన్నారు. వచ్చే ఏడాది మరింత వినూత్నంగా నిర్వహించాలని తీర్మానించామని తెలిపారు. బాలోత్సవం న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన భాషా పండితులు, కళాకారులు, కవులను సత్కరించారు.

సంక్షిప్త సమాచారం

కార్పెంటర్ ఆత్మహత్య

అనంతపురం: పని దొరకలేదనే కారణంతో సెల్ఫులు, బల్లలు తయారు చేసే ఓ కార్పెంటర్ గురువారం ఆత్మహత్య చేసుకున్న ఘటన నగరంలో చోటు చేసుకుంది. త్రీ టౌన్ సీఐ శాంతిలాల్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాజీవ్ నగర్‌లోని రామయ్య కాలనీలో మహమ్మద్ రఫీ (40) నివాసం ఉంటున్నాడు. మహమ్మద్ రఫీ వ్యక్తిగత అవసరాల నిమిత్తం బ్యాంకులో అప్పు చేశాడు. పనులు దొరకక పోవడంతో ప్రతి నెలా బ్యాంకు కంతులు చెల్లించేందుకు తీవ్ర ఇబ్బందుల పడ్డాడు. మనస్తాపానికి గురైన రఫీ.. ఇంట్లో రేకుల కప్పు కింద ఉన్న ఇనుప కడ్డీకి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య తస్లీమా, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య తస్లీమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ప్రభాకర్‌పై చర్యలు తీసుకోండి

అనంతపురం టవర్‌క్లాక్: నకిలీ డాక్యుమెంట్స్‌తో మా భూమిని కాజేయాలని ప్రయత్నిస్తున్న ప్రభాకర్‌పై చర్యలు తీసుకోవాలని దంపెట్ల రవి కోరారు. గురువారం ఆయన స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. పల్లె రఘునాథ్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డిని అడ్డు పెట్టుకుని కియా వద్ద ఉన్న మా భూమిని ప్రభాకర్ కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడన్నారు. ప్రభాకర్‌పై కియా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. అయినా తిరిగి మమల్ని బెదిరిస్తున్నాడని పేర్కొన్నారు. ప్రభాకర్ నుంచి మాకు రక్షణ కల్పించాలని జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి రక్షణ కల్పించాలని కోరారు.

పింఛన్ విషయంలో వాగ్వాదం

అనంతపురం: పింఛన్ విషయంలో అన్నదమ్ముల మధ్య వాగ్వాదం జరిగింది. త్రీ టౌన్ సీఐ శాంతిలాల్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కరెంట్ ఆఫీసులో డ్రైవర్‌గా పని చేస్తున్న చాకలి నారప్ప ఇటీవల మరణించాడు. నారప్ప భార్యకు వృద్ధాప్య పింఛన్ వస్తుంది. అన్నదమ్ములైన చాకలి చంద్రాయుడు, చాకలి రాజశేఖర్ తండ్రి పింఛన్ కోసం గొడవపడ్డారు. చాకలి రాజశేఖర్‌కు మద్దతుగా అతడి బావ వచ్చాడు. బామ్మర్ది అయిన చాకలి చంద్రాయుడుపై ఇనుపరాడ్డుతో దాడి చేశాడు. చాకలి రాజశేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేడు మాతృభాషా దినోత్సవం

అనంతపురం కల్చరల్: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం నగర వీధుల్లో శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలుగు భాషా సంరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ బి.నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.45 గంటలకు స్థానిక సాయిబాబా కళాశాల నుంచి తెలుగు తల్లి విగ్రహం వరకూ ర్యాలీ ఉంటుందన్నారు.

కూలర్స్, ఫ్యాన్లు వితరణ

అనంతపురం కల్చరల్: మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం కెనరా బ్యాంక్ న్యూటౌన్ శాఖ వారు సీఎస్‌ఆర్ గ్రాంట్ ద్వారా త్రికెన్ స్టార్ కూలర్స్, మూడు పెడస్టల్ ఫ్యాన్లు, 6 వాల్ ఫ్యాన్లు, 2 సీలింగ్ ఫ్యాన్లను శివాలయం ఈఓ రమేష్‌బాబుకు అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ రాహుల్, డీఎం శరణకుమార్ మాట్లాడుతూ.. శివరాత్రి ఉత్సవాలలో తాము భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వన్నూరు స్వామి, మాజీ ఆలయ చైర్మన్ జీజే వేణు, భక్తమండలి నరేంద్ర చౌదరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

రాప్తాడు: ఈనెల 22న అనంతపురం జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు జగ్గుల స్వతంత్ర కుమారి పేర్కొన్నారు. గురువారం ఆమె రాప్తాడులో విలేకరులతో మాట్లాడుతూ.. అనంతలో బల్ల ఫంక్షన్ హాల్‌లో జరిగే రాష్ట్ర సదస్సుకు కృష్ణ మాదిగ హాజరవుతారన్నారు.

అర్చకులను కాపాడుకుందాం

అనంతపురం కల్చరల్: సనాతన భారతీయ వ్యవస్థలో అర్చకులది విశిష్టమైన స్థానం. అలాంటి అర్చకులను గౌరవించడం మన బాధ్యత అని బ్రహ్మకుమారీల ఇన్‌చార్జ్ సిస్టర్ శారద తెలిపారు. గురువారం పాతూరులోని ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయం బ్రహ్మకుమారీల సంస్థ ఆధ్వర్యంలో శివజయంతి నిర్వహించారు. అనంత, పుట్టపర్తి జిల్లాల తరఫున ప్రాతినిథ్యం వహిస్తున్న 70 మంది అర్చకులను ఘనంగా సత్కరించారు. మౌంట్‌అబు నుంచి విచ్చేసిన పరమేశ్వర్, పుట్టపర్తి ఇన్‌చార్జ్ సిస్టర్ కల్పన తదితరులు అర్చక విశిష్టతను వివరించారు. నిస్వార్థంగా పని చేస్తున్న అర్చకులు నేటి సమాజంలో దుర్భరపరిస్థితులను ఎదుర్కొంటున్నారన్నారు. అర్చకులను కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంపై ఉంటుందన్నారు. కార్యక్రమంలో చిన్మయామిషన్ స్వామి ఆత్మవిదానంద సరస్వతి, జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు ఆంజనేయులు, అన్నామలై స్వామీజీ, వేదపండితుడు హరికృష్ణ స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.



స్వామీజీని సత్కరిస్తున్న బ్రహ్మకుమారీలు

నిత్యావసరాల పంపిణీ

నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక ఆదర్శనగర్ పుట్టినిల్లు ఆశ్రమం వద్ద డాక్టర్ నిర్మల నేతృత్వంలో 12 మంది అర్చకుల కుటుంబాలకు నిత్యావసరాలు అందజేశారు. హిందూ ధర్మ సంస్కృతిని కాపాడుతున్న అర్చకులను గౌరవించాలని సూచించారు.

ఒంటిపూట బడులు ప్రారంభించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా రోజురోజుకు పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తక్షణమే ఒంటిపూట బడులు ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు కోరారు. గురువారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో ఫిబ్రవరి మాసం నుంచే ఎండల తీవ్రత విపరీతంగా పెరుగుతోందన్నారు. విద్యాసంస్థలలో ఒంటిపూట బడులు నిర్వహించాలని కోరారు. మార్చి 17 నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు సంబంధించి అన్ని కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. గత విద్యా సంవత్సరం పరీక్షల సమయంలో కొన్ని ప్రాంతాలలో విద్యార్థులు బెంచీలు లేక కింద కూర్చొని పరీక్ష రాసిన సంఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అన్ని వసతుల కల్పించాలన్నారు. హాల్ టికెట్ ఉన్న ప్రతి విద్యార్థికీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మంజునాథ్, ఉమా మహేష్, నాయకులు పవన్, సునీల్, వంశీ పాల్గొన్నారు.



డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

పిల్లలకు అర్థమయ్యేలా బోధించండి

ఆత్మకూరు: అంగన్‌వాడీల్లోని చిన్నారులకు ఆటలు, పాటల రూపంలో అర్థమయ్యేలా విద్యా బోధన చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య, శ్రీవాణి తెలిపారు. గురువారం స్థానిక ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు నిర్వహించారు. అంగన్‌వాడీల నుంచి ప్రైమరీ పాఠశాలలకు వచ్చే పిల్లలకు విధంగా విద్య నేర్పించాలో వివరించారు. ఆటలు, పాటల రూపంలో ఏబీసీడీలు, చిన్న చిన్న పదాలు, అంకెలను శిక్షణలో నేర్పించారు.

రాప్తాడు: పునాది దశలోనే విద్యను బలోపేతం చేయడం జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం ముఖ్య లక్ష్యమని ఎంఈఓ మల్లికార్జున పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడో రోజూ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మల్లికార్జున మాట్లాడుతూ.. జ్ఞాన జ్యోతి కార్యక్రమం ద్వారా మండల స్థాయిలో ఆరు రోజుల పాటు శిక్షణ తరగుతులు నిర్వహిస్తామన్నారు. శిక్షణ అంగన్‌వాడీ కార్యకర్తలకు పునాది లాంటిదన్నారు. అభ్యసనను బలోపేతం చేయడం, పిల్లలకు ఆటలు, పాటలతో విద్యా బోధన తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 కుళ్లాయప్ప, సూపర్‌వైజర్స్ నాగరత్న, హేమలత, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన అంగన్‌వాడీ కార్యకర్తలు

సెంట్రల్ పార్క్ స్థలాన్ని పరిరక్షించరా?

అనంతపురం కార్పొరేషన్: సెంట్రల్ పార్క్ స్థలాన్ని పరిరక్షించాలని సీపీఐ నాయకులు కోరారు. గురువారం నగరపాలక సంస్థలో కమిషనర్ బాలస్వామికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రూ.వంద కోట్లు విలువ చేసే స్థలంలో ఎకరాల స్థలం కబ్జాకు గురవుతున్నా.. ఇంత వరకు సెంట్రల్ పార్క్ విషయాన్ని ఎటూ తేల్చలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారన్నారు. కమిషనర్లు రావడం.. సర్వే చేయడం, వెళ్లిపోవడం జరుగుతోందన్నారు. అలాగే నగరంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న నగరపాలక సంస్థ ఆస్తులను పరిరక్షించాలని కోరారు. అందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు, సహాయ కార్యదర్శులు బి.రమణ, అల్లీపీరా, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి జి.సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీలో పడిపోయిన ట్రాక్టర్ ఇంజన్

ట్యాంకర్‌ను క్రేన్ సహాయంతో బయటకు తీస్తున్న దృశ్యం

డ్రైనేజీలోకి దూసుకెళ్లిన ట్యాంకర్

స్థానిక కళ్యాణదుర్గం బైపాస్ నుంచి రుద్రంపేటకు వచ్చే నేషనల్ హైవే సర్వీస్ రోడ్డులో గురువారం డ్రైనేజీలోకి ఓ వాటర్ ట్యాంకర్ అదుపుతప్పి దూసుకెళ్లింది. డ్రైవర్ పక్కకు పడిపోవడంతో సురక్షితంగా బయటపడ్డాడు. ఆ సమయంలో వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. డ్రైనేజీకి సైడ్ వాల్ లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ మార్గంలో ఎక్కువగా స్కూల్ బస్సులు తిరుగుతుంటాయని.. ప్రమాదాలు జరగకముందే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం